

దోస్త్ షురూ..

డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రిత్వశాఖ దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

వివరాలు 8లో ▸



నవోదయం.. శతశాతం

సీబీఎస్‌ఈ టెన్త్, ట్వెల్త్ క్లాస్ పరీక్షల్లో వర్గల్ నవోదయ శతశాతం ఉత్తీర్ణత సాధించింది.

వివరాలు 8లో ▸



అజంతా ఎక్స్‌ప్రెస్ ఆగేనా?

మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో గతంలో అన్ని రైళ్లు ఆగేవి. కానీ ప్రస్తుతం అజంతా ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ అనేది అందని ద్రాక్షగానే మారింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సమష్టి కృషితో విజయవంతం

కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ కలెక్టరేట్: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేనిదని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఓటర్లు పెద్ద ఎత్తున ఎండలను సైతం లెక్కచేయక ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులను కలెక్టర్ రాహుల్ రాజ్ అభినందించారు.

అందరికీ కృతజ్ఞతలు

ఎమ్మెల్యే హరీశ్ రావు



సిద్దిపేటజోన్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని వెలుబుచ్చే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య స్ఫూర్తి చాటారని కొనియాడారు. అక్క చెల్లెళ్లు, అన్న తమ్ముళ్లకు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగించిన అధికారులు, పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియపారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నీలం



సీఎం రేవంత్‌తో నీలం మధు

పటాన్‌చెరు : లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలింగ్ సరళిని వారికి వివరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... మెదక్‌లో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం ఖాయమని, ఆ స్థానం నుంచి తప్పక గెలుస్తామని రేవంత్ అన్నట్లు నీలం మధు తెలిపారు. ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని, కాంగ్రెస్‌కు ఓటేసిన ఓటర్లందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించండి

ఏఈకి మంత్రి దామోదర ఆదేశం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఏఈని ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్‌కు వెళుతున్న మంత్రిని అల్లాదుర్గం గ్రామస్తులు ఆపారు. మండల పరిధిలోని చిల్వెర గ్రామానికి అల్లాదుర్గం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామానికి ప్రత్యేక ఫీడర్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య తలెత్తినా గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో రెండు, మూడు సార్లు సబ్‌స్టేషన్‌ను గ్రామస్తులు ముట్టడించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఆందోళనకు దిగడంతో, అటువైపు నుంచి మంత్రి దామోదర వస్తున్నారన్న సమాచారం మేరకు చిల్వెర గ్రామస్తులు 161 రహదారిపై కారును ఆపి సమస్యను వివరించారు. విద్యుత్ ఏఈని పిలిచి వెంటనే సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ రవీందర్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట, రామోజిపల్లి, వీరోజిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తేమశాతంపై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203లు చెల్లిస్తున్నామని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆయన సూచించారు.

ఎవరికి అనుకూలమో?

- సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్
- గత ఎన్నికల కంటే 4.93 శాతం అధికం
- మెజారిటీపై లెక్కలు
- తలమునకలైన అభ్యర్థులు
- పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ సరళిపై ఆరా
- ఫలితాలు వచ్చే వరకు అభ్యర్థుల్లో తప్పని టెన్షన్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పెరిగిన ఓటింగ్ ఏ పార్టీ అభ్యర్థికి మేలు చేస్తుంది.. ఏ పార్టీ అభ్యర్థికి నష్టం జరుగుతుంది.. అనే దానిపై రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో నియోజకవర్గం పరిధిలో ఓటర్లు పోటెత్తారు. భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల తర్వాత కూడా క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే అత్యధిక పోలింగ్ నమోదైన నియోజకవర్గాల్లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కూడా ఉంది.

ఇక్కడ మొత్తం 16.41 లక్షల మంది ఓటర్లు ఉండగా, 12.25 లక్షల మంది ఓటేశారు. అంటే 74.63 శాతం మంది ఓటేసినట్లు అధికారులు మంగళవారం సాయంత్రం ప్రకటించారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో కేవలం 69.01 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అంటే గత ఎన్నికల కంటే సుమారు 4.93 శాతం ఓట్లు అధికంగా పోలవడం గమనార్హం. ఇలా పెరిగిన ఓటింగ్ ఏ పార్టీ అభ్యర్థిని గెలుపు తీరాలకు చేర్చుతుందా? అనే దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సామాజికవర్గాల వారీగా..

సామాజికవర్గాల వారీగా ఓటర్లు ఏ పార్టీ అభ్యర్థికి ఓటేశారు.. అనే దానిపైనా ఆరా తీస్తున్నారు. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో తమ ప్రధాన అనుచరులైన ఆయా సామాజికవర్గాలకు చెందిన నాయకులకు ఫోన్‌లు చేసి ఓటింగ్ వివరాలను తెలుసుకుంటున్నారు. నియోజకవర్గంలో మైనార్టీల ఓట్లు ఏ పార్టీకి ఎక్కువ పోలయ్యాయి. అధిక సంఖ్యలో ఉన్న లింగాయత్‌లు, మున్నూరుకాపులు ఎటువైపు మొగ్గ చూపారు. ఎస్సీ, ఎస్టీలు ఎవరి వైపు నిలిచారు. అలాగే యువత ఏ పార్టీ వైపు నిలబడ్డారు. రైతులు ఎవరిని ఆదరించారు తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు నుంచి తీవ్రంగా శ్రమించిన అభ్యర్థులు.. ఇప్పుడు కొంత రిలాక్స్ అయ్యారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా నియోజకవర్గాలను చుట్టేసిన నేతలకు ఇప్పుడు కొంత తీరిక లభించినట్లయింది. కానీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై అభ్యర్థుల్లో టెన్షన్.. ఫలితాలు వచ్చే వరకు కొనసాగనుంది.

ఇన్‌చార్జిలు సైతం ఆరా..

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు సైతం తమ నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎంత ఓటింగ్ జరిగిందనే దానిపై ఆరా తీశారు. సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్‌లో మండలాల వారీగా పోలింగ్ సరళిని ఆయా మండల నేతలతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం.

లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు

బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్ సరళిపై లెక్కలేసుకుంటున్నారు. ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంత పోలింగ్ జరిగింది. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలైన ఓట్లు ఎన్ని..? తమకు లీడ్ వస్తుందా..? ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మెజారిటీ వస్తుందా..? ఎంత మొత్తంలో లీడ్ వస్తుంది..? ఇలా లోతైన విశ్లేషణలు చేసుకుంటున్నారు. ప్రధాన అనుచరులకు ఫోన్లు చేసి గ్రామాల వారీగా, పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ సరళి.. తమకు పడిన ఓట్లు ఎన్ని ఉంటాయనే దానిపై సమాచారం సేకరిస్తున్నారు.



స్ట్రాంగ్ రూంకు సీలు వేసిన ఎన్నికల అధికారులు

ఈవీఎంలు భద్రం

జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

నర్సాపూర్: మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కాలేజీ, గిరిజన గురుకుల కాలేజీలోని స్ట్రాంగ్ రూంలలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి, నియోజకవర్గాల ఏఆర్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మైక్రో అబ్జర్వర్‌లతో కలిసి ఆయన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచి సీల్ వేశారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను బీవీఆర్‌ఐటీ కాలేజీలో, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు గిరిజన గురుకుల కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చి సీల్ వేశామన్నారు. సీసీ కెమెరాలు పర్యవేక్షణ, నిరంతరం కేంద్ర ప్రభుత్వ సాయుధ దళాల పహారా ఉంటుందని స్పష్టం చేశారు. మెదక్ లోక్‌సభ పరిధిలో ఎక్కడా కూడా రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించామన్నారు. 75.09 శాతం పోలింగ్ నమోదైందన్నారు. నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 84.25 శాతం పోలింగ్, పటాన్‌చెరు సెగ్మెంటు పరిధిలో అత్యల్పంగా 63.01శాతం నమోదైందన్నారు. కాగా, స్ట్రాంగ్ రూంలను మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పార్టీ నాయకులు సురేష్, రమణారావు, ఆంజనేయులుగౌడ్ రమేష్‌యాదవ్, దేవేందర్‌యాదవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ బాలస్వామి, పలువురు డీఎస్పీలు పాల్గొన్నారు.

తగ్గిన పోలింగ్.. పెరిగిన టెన్షన్

లోక్‌సభ ఎన్నికల్లో తగ్గిన ఓటింగ్

- మెదక్ పార్లమెంట్ పరిధిలో 75.09శాతం నమోదు
- గత అసెంబ్లీతో పోలిస్తే 5.43శాతం తగ్గుదల
- తక్కువ ఓటింగ్‌పై రాజకీయ వర్గాల్లో అలజడి

అసెంబ్లీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది. ఈసారి 5.43శాతం తక్కువగా నమోదైంది. తక్కువ ఓటింగ్ ఎవరిపై ప్రభావం చూపుతుందోనని అభ్యర్థులు, ఆయా పార్టీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ పోలింగ్ శాతం పెరగకపోవడం గమనార్హం.

– సాక్షి, సిద్దిపేట



మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,71,318 మంది ఓటర్లున్నారు. అయితే గత అసెంబ్లీ పోరులో 14,26,268 (80.52శాతం), ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 13,72,894 (75.09 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 5.43శాతం తగ్గింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో 79.42శాతం పోలింగ్ కాగా, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 71.71శాతం నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే 3.38 పోలింగ్ పెరిగిందని చెప్పవచ్చు.

అత్యధికంగా నర్సాపూర్..

లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికంగా నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 84.25 శాతం నమోదైంది. అత్యల్పంగా పటాన్‌చెరులో 63.01శాతం రికార్డు యింది. పటాన్ చెరు నియోజకవర్గంలో ఓటర్లు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో తక్కువగా నమోదైందని చర్చించుకుంటున్నారు.

ఎవరికి నష్టం

మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల బీఆర్‌ఎస్, ఒక్క చోట కాంగ్రెస్ గెలుపొందింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో 5.43శాతం పోలింగ్ తగ్గడంపై ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది. తక్కువగా నమోదు కావడంతో ఎవరికి చేటు చేస్తుంది? ఎవరికి లాభం చేస్తుంది? అన్న చర్చ జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ సరళి..

అసెంబ్లీ	2024 పార్లమెంట్	2023 అసెంబ్లీ	2019పార్లమెంట్	2018 అసెంబ్లీ
సిద్దిపేట	1,74,969	1,81,469	1,48,322	1,67,113
మెదక్	1,75,409	1,86,946	1,49,232	1,68,911
నర్సాపూర్	1,91,315	1,98,079	1,64,520	1,83,711
సంగారెడ్డి	1,79,801	1,86,695	1,52,844	1,67,412
పటాన్‌చెరు	2,60,841	2,76,895	1,97,495	2,14,142
దుబ్బాక	1,64,952	1,74,834	1,46,170	1,64,285
గజ్వేల్	2,25,607	2,32,417	1,90,907	2,07,542

రైతుబజార్.. ఉన్నా లేనట్టే..!

రూ.50 లక్షలతో నిర్మాణం

- వసతులు కల్పనలో నిర్లక్ష్యం
- ప్రజలు రాకపోవడంతో కొనసాగని వ్యాపారం
- రోడ్డుపైనే సంతో ప్రజల పాట్లు
- అసంపూర్తిగా కొత్త దుకాణ సముదాయం



రైతు బజారులో నిరుపయోగంగా దుకాణ సదుపాయం

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణంలో రూ.50 లక్షలతో ఏడేళ్ల క్రితం నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. సరైన వసతులు లేక ఇక్కడ ఉన్న దుకాణాల్లో వ్యాపారం చేసుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా మార్కెట్‌కు అనుకూలమైన ప్రాంతంలో రైతు బజార్ నిర్మించకపోవడంతో జనం ఎవరూ అటువైపు రావ డం లేదు. దీంతో వ్యాపారం సరిగా సాగకపోవడంతో జూనియర్ కళాశాల ఎదురుగా సీఎస్‌ఐ ఆధీనంలో ఉన్న స్థలంలో మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా, ప్రతీ బుధవారం జరిగే వారాంతపు సంత మాత్రం పట్టణం మధ్యలో ఇరుకు స్థలంలో కొనసాగుతోంది. గల్లీలో సంత జరగడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతోపాటు దుమ్ముధూళితో కూరగాయలు పాడవుతున్నాయి.

మూణ్నాళ్ల ముచ్చటేనా..!

గతంలో కూరగాయల వ్యాపారం పట్టణంలోకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కొనసాగేది. రోడ్డు పక్కన మార్కెట్ ఏర్పాటు చేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడేవారు. దీంతో అధికారులు ప్రత్యేకంగా రైతుబజార్ నిర్మించి వ్యాపారులకు దుకాణాలు కేటాయించారు. కాగా, ఇందులో వ్యాపారం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. రైతు బజార్‌కు ప్రజలు సరిగా రాకపోవడంతో కూరగాయల వ్యాపారం సరిగా సాగకపోయేది. దీంతో ఇక్కడ దుకాణాలు కొనసాగించడానికి వ్యాపారులు ఆసక్తి చూపలేదు. కొందరు మాంసం వ్యాపారులు మాత్రమే రైతుబజార్‌లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీనికితోడు సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడం మరో సమస్యగా మారింది. దీంతో మళ్లీ రోడుపక్కన, సీఎస్‌ఐ స్థలంలో ప్రతిరోజూ కూరగాయల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వ్యాపారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారే తప్ప రైతుబజార్‌లోకి వెళ్లడానికి ఇష్టపడటంలేదు. చేపల సంత ప్రతీ బుధవారం సిద్దిపేట రోడ్డు వెంట నిర్వహిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.



పట్టణంలో ఇరుకు స్థలంలో వారాంతపు సంత

ట్రాఫిక్ సమస్య..

పట్టణంలో ప్రతీ బుధవారం వారాంతపు సంత కొనసాగుతోంది. ఇరుకు రోడ్డుపై ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ సంతకు జిల్లావాసులతో పాటు పొరుగున ఉన్న కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన వేలాది మంది వస్తుంటారు. దీంతో రద్దీ నెలకొంటుంది. కాలినడకన వెళ్లే వీలు కూడా ఉండటం లేదు.

కొత్త కాంప్లెక్స్ పిల్లర్లకే పరిమితం..

రామాయంపేటలో అధునాతన రీతిలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ సముదాయం నిర్మాణానికి మూడేళ్ల క్రితమే రూ. 3కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్థలం అనువుగా లేకపోయినా ఎంపీపీ కార్యా లయం ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులున్నంత వరకు పనులు కొనసాగాయి. ప్రస్తుతం పిల్లర్ల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. నిధుల లేమితో పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్లు సమాచారం. అదనంగా నిధులు మంజూరుచేసి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు బజారు వ్యాపారానికి అనుకూలంగా లేదు



రైతుబజారు కూరగాయల వ్యాపారానికి అనువుగాలేదు. ఇందులో అన్నీ సమస్యలే నెలకొన్నాయి. పార్కింగ్ స్థలంతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలల సదుపాయంలేదు. ఇక్కడికి జనం రావడం లేదు. కొత్త భవన నిర్మాణం పూర్తి చేసి, అందులో పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చాలి.

– దుర్గయ్య, కూరగాయల వ్యాపారి

కొత్త కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయిస్తాం..



రామాయంపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెజ్ నాన్ వెజ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం. నిలిచిపోయిన పనులకు సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. పాత రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్



కొడిపల్లి: స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న యువకులు

ఉక్కపోత నుంచి ఉపశమనం

ఎండలు మండుతుండటంతో యువకులు ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు. కొడిపల్లి మండలం కూకుట్లపల్లికి వెళ్లేదారిలో పొలం వద్ద మినీ స్విమ్మింగ్‌పూల్ ఉంది. పాత ట్యూబ్‌లలో గాలినింపి వాటిని తగిలించుకుని ఈత నేర్చుకుంటున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనంతో పాటు ఈత నేర్చుకోవడం రెండూ జరుగుతున్నాయి.

– కొడిపల్లి(నర్సాపూర్)

మెదక్‌లో కారుదే గెలుపు

సంగారెడ్డి : గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్‌ఎస్‌కు ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. లక్ష మెజారిటీతో వెంకట్రామిరెడ్డి విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరించినా తగ్గలేదన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ టైమ్ పాస్ రాజకీయాలు చేస్తుందన్నారు.

క్లుప్తంగా

జాతీయ 'ప్రేరణ క్యాంపు'నకు సిద్దిపేట విద్యార్థులు


మీర్జా సపూరా (ఫైల్)


శ్రీకాంత్(ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జాతీయ స్థాయి ప్రేరణ క్యాంపునకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్, ప్రేరణ కార్యక్రమం నోడల్ అధికారి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రేరణ క్యాంపులో రాణించిన ఇద్దరు విద్యార్థులను జాతీయ స్థాయి ప్రేరణ క్యాంపునకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకట్రావుపేటకు చెందిన పదవ తరగతి విద్యార్థి శ్రీకాంత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాలకు చెందిన 10వ తరతి విద్యార్థిని మీర్జా సపూరాలు జాతీయ స్థాయి ప్రేరణ క్యాంపుకు ఎంపికయ్యారన్నారు.గుజరాత్‌లో జూన్ 1 నుంచి 6వరకు నిర్వహించే క్యాంపులో పాల్గొననున్నట్లు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతి

సంతాపం వ్యక్తం చేసిన సీపీ, పోలీస్ అధికారులు


సాయం అందిస్తున్న పోలీస్ అధికారులు

సిద్దిపేటఅర్బన్: అనారోగ్యానికి గురైన హెడ్ కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణానికి చెందిన సయ్యద్ సలీముద్దీన్ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యానికి గురైన సలీముద్దీన్ కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. పోలీస్ శాఖ నుండి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఆర్ఎస్సై విజయ్‌భాస్కర్, పోలీస్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పోలీస్ అధికారులు, బ్యాచ్ మేట్స్, త్రీటౌన్ సిబ్బంది సలీముద్దీన్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తంప్రభుత్వం తరపున రూ.20 వేలు అందజేశారు.

మూడు రోజులకు అంత్యక్రియలు

కన్న తండ్రి చేతిలో హత్యకు గురైన ముఖేష్

చిన్నశంకరంపేట(మెదక్): బెట్టింగ్‌లో సర్వం కోల్పోయి ఉన్న ఆస్తులను అమ్మేశాడనే ఆగ్రహంతో కన్న తండ్రి చేతిలో హత్యకు గురైన ముఖేష్ కుమార్(28) అంత్యక్రియలు మూడో రోజున జరిగాయి. చిన్నశంకరంపేట మధిర గ్రామమైన భగీరథపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సత్యనారాయణ పెద్ద కుమారుడు ముఖేష్ కుమార్‌ను ఇనుపరాడ్‌తో శనివారం అర్ధరాత్రి హత్య చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామ నిర్వహించినప్పటికీ ఫిర్యాదు అందడంలో ఆలస్యం కావడంతో పోస్టుమార్టం కాలేదు. ముకేష్ భార్య రజిత, కుమార్తె రష్మిక ఉండగా ఉమ్మడి ఆస్తిలో ఉన్నవాటిని ముకేష్ భార్య పేరున రాయాలని ఆమె బంధువులు పట్టు బట్టారు. కానీ సత్యనారాయణ అందుబాటులో లేక ఆస్తులెంత అప్పులెంత అనే విషయంలో స్పష్టత లేనందున ఒక ఒప్పందానికి రావడం ఎలా సాధ్యమని గ్రామస్తులు నిరాకరించారు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడం, శవాన్ని తీసుకునేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించడంతో అంత్యక్రియలు జరిగేందుకు మూడు రోజులు పట్టింది.

దోస్త్ షురూ..

సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో 14 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

- మూడు దశల్లో డిగ్రీ అడ్మిషన్లు
- ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్

ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రిత్వశాఖ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 25లోగా అధికారిక వెబ్‌సైట్ (డీఓఎస్‌టీ.సీజీజీ.జీఓవీ ఐఎన్)లో ఆన్‌లైన్ ద్వారా తొలిదశలో భాగంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

– సిద్దిపేటఎడ్యుకేషన్ / కొండాపూర్(సంగారెడ్డి)

ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులు రూ. 200 రుసుముగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఈనెల 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్‌లో భాగంగా తమకు నచ్చిన కళాశాల, కోర్సులను ఎంపిక చేసుకోవాలి. సీట్ల లభ్యత ఆధారంగా అభ్యర్థులకు జూన్ 3న సీట్లను కేటాయిస్తారు. తమకు కేయించిన సీట్ల కోసం జూన్ 4 నుంచి 10 లోగా అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్‌తో పాటు అడ్మిషన్ ఫీజును చెల్లించాలి. ఇక రెండో దశ రిజిస్ట్రేషన్‌ను రూ.400లు చెల్లించి జూన్ 4 నుంచి 13 వరకు చేసుకోవాలి. 14న వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌తోపాటు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మూడో దశ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జూన్ 19 నుంచి 25 లోగా రూ. 400 ఫీజు చెల్లించి చేసుకోవాలి. వెబ్ ఆప్షన్ జూన్ 26 వరకు అందుబాటులో ఉండగా, 29న సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 3లోగా విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. మూడు దశలో రిపోర్ట్ చేసిన విద్యార్థులకు ఎంపిక చేసుకున్న కళాశాలల్లో జులై 5లోగా వ్యక్తిగతంగా రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మొత్తంగా 8 నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభం అవుతాయి.

సిద్దిపేట జిల్లాలో కళాశాలలు, సీట్ల వివరాలు..

జిల్లాలోని 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 3,660 సీట్లున్నాయి. సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ కళాశాలలో 1,680 సీట్లు, మహిళా డిగ్రీ కళాశాలలో 240 సీట్లు, గజ్వేల్ డిగ్రీ కళాశాలలో 340, మహిళా డిగ్రీ కళాశాలలో 560 సీట్లు, దుబ్బాక డిగ్రీ కళాశాలలో 240, హుస్నాబాద్ కళాశాలలో 240, చేర్యాల డిగ్రీ కళాశాలలో 240 సీట్లు ఉన్నాయి. ఇక జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్‌లలో సుమారు 15 ప్రైవేట్ డిగ్రీ కళాల్లో సుమారు 3,000 వేల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.



సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రిజిస్ట్రేషన్ ఇలా..

- రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థుల వద్ద పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించిన మార్కుల జాబితా, 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు టీసీతోపాటు, కులం, ప్రస్తుత సంవత్సరం ఆదాయం సరిఫికెట్ ఉండాలి.
- దోస్త్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నేరుగా యాప్‌లో విద్యార్థులు పూర్తి వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి దోస్త్ ఐడీ, పిన్ నంబర్ వస్తుంది. వాటిని ఉపయోగించి, దరఖాస్తు ఫారమ్ నింపాల్సి ఉంటుంది. ప్రవేశ ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ దోస్త్ ఐడీ, పిన్ నంబర్‌ను ఇతరులతో షేర్ చేయొద్దు
- విద్యార్థులు కోర్సులు, కళాశాలల వారీగా ప్రాధాన్యతా క్రమంలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

రెండు కొత్త కోర్సులు..

ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు రెండు నూతన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఈ కోర్సులు అందుబాటులో ఉంటాయి. 60 సీట్లతో బీకామ్ ఫైనాన్స్, మరో 60 సీట్లతో బీఏ హెచ్ఈపీ స్పెషల్ పేరుతో రెండు కోర్సులు అందుబాటులో ఉండనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు డిగ్రీలో నచ్చిన కోర్సులు, నచ్చిన కళాశాలలో చేరేందుకు ఇది సువర్ణావకాశం. ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్ సమయంలో సందేహాలుంటే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినా, సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వెళ్లినా నివృత్తి చేస్తారు.

– రత్నప్రసాద్, ప్రిన్సిపాల్, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సంగారెడ్డి జిల్లాలో కళాశాలలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 4 వేల మంది విద్యార్థులుండగా, ప్రైవేట్ కళాశాలలో 17 వేలకు పైగా విద్యార్థులున్నారు. డిగ్రీలో విద్యార్థులు మొదటి సంవత్సరంలో ప్రవేశించేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలున్నా దగ్గరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ నంబర్ 79892 39115ను సంప్రదించవచ్చు.

భళా.. హస్తకళా

సంగారెడ్డి: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. ఇందులో గద్వాల, వరంగల్, సిద్దిపేట, వెంకటగిరి చేనేత వస్త్రాలను పోచంపల్లి నారాయణపేట, ఉప్పాడ, కంచి, ధర్మవరం కాటన్ చీరలు, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. హస్త కళ వస్తువులైన కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, మైసూర్ రోజ్వుడ్ వస్తువులు, వరంగల్ లెదర్స్, బంజారా ఎబ్రాయిడరీ హైదరాబాద్ పెరల్స్, చెక్క వస్తువులు, బెంగాలీ జూట్ బ్యాగులను ఏర్పాటు చేశారు. సమ్మర్ కావడంతో మేళాను చూసేందుకు ప్రజలు భారీగా వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.





హస్త కళలో వివిధ రకాల వస్తువులు

నవోదయం శతశాతం

- టెన్త్, ట్వెల్త్‌లో వందశాతం ఉత్తీర్ణత
- ఫలితాలు వెల్లడించిన ప్రిన్సిపాల్


అనిమేశ్ దాస్ (టెన్త్ టాపర్)


వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): సీబీఎస్ఈ టెన్త్, ట్వెల్త్ క్లాస్ పరీక్షల్లో వర్గల్ నవోదయ శతశాతం ఉత్తీర్ణత సాధించింది. ఫలితాల వివరాలను మంగళవారం నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరం టెన్త్, ట్వెల్త్ చదువుతున్న నవోదయ విద్యార్థులకు మార్చి, ఏప్రిల్ నెలలో సీబీఎస్ఈ బోర్డు వార్షిక పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలలో అందరూ ఉత్తీర్ణులయ్యారు. టెన్త్‌క్లాసులో 74 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 74 మంది, ట్వెల్త్ క్లాసులో 33 మందికి 33 మంది ఉత్తీర్ణులై శతశాతం నమోదు చేశారు. టెన్త్ క్లాసులో అనిమేశ్‌దాస్ 500 మార్కులకు 478(95.6%) మార్కులతో విద్యాలయ టాపర్‌గా, 476(95.2%) మార్కులతో ఎం.సింధు కేతకి ద్వితీయ స్థానంలో నిలిచారు. 474(94.8%) మార్కులతో డీ మనోహర్, బీ శ్రీవైష్ణవి తృతీయ స్థానంలో నిలిచారు. ట్వెల్త్ క్లాసులో మేఘన సౌమ్య 500లకు 450(90%) మార్కులతో ప్రథమ, ఎల్ యాదగిరి 448(89.6%) మార్కులతో ద్వితీయ, 418(83.6%) మార్కులతో సాయితేజ తృతీయ స్థానాలు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపకులు అభినందించారు.


సింధు కేతకి (టెన్త్ సెకండ్)


డీ మనోహర్ (టెన్త్ తృతీయ)


శ్రీవైష్ణవి (టెన్త్ తృతీయ)


మేఘన సౌమ్య (ట్వెల్త్ టాపర్)


ఎల్ యాదగిరి (ట్వెల్త్ సెకండ్)


సాయితేజ (ట్వెల్త్ తృతీయ)

పనులు సా..గుతున్నాయి

- నిదానంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణం
- జహీరాబాద్‌లో 50 పడకలతో ఆస్పత్రి
- 2022లో రూ.7.50 కోట్లతో పనులు ప్రారంభం
- ఇంకా పూర్తికాని వైనం

జహీరాబాద్ టౌన్: మహిళల ఆరోగ్యం కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన మాతాశిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే జహీరాబాద్‌లో వంద పడకల ఆస్పత్రిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆడబిడ్డలకు మరింత మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వెనుక కొత్తగా 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేసింది. ప్రారంభంలో పనుల్లో వేగం కనిపించినా.. ప్రస్తుతం నిదానంగా సాగుతుండడంతో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జహీరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ప్రసవాలు, నవజాత శిశు సేవలతో ఇప్పటికే గుర్తింపు పొందింది. ఈ సేవలను మరింత విస్తరించాలనే నేపథ్యంలో 2022లో మాజీ వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మరో 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. దీని నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. ప్రారంభంలో నిర్మాణం శరవేగంతో చేసిన కాంట్రాక్టర్ ప్రస్తుతం నిర్లక్ష్యంతో నిదానంగా చేస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మాణంలో మాతాశిశు ఆరోగ్య కేంద్రం

మరిన్ని ఆధునిక వైద్య సేవలు

మాతాశిశు ఆరోగ్యం కేంద్రం నిర్మాణం పూర్తి అయితే మరిన్ని ఆధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. కార్పొరేట్ తరహా వసతులు ఉంటాయి. 24 గంటల పాటు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం పగలు మాత్రమే సేవలు అందుతున్నాయి. స్త్రీ వైద్య నిపుణులు, ఆపరేషన్ థియేటర్, మత్తు మందు డాక్టర్లు, నవజాత శిశు వార్డులు, గైనకాలిస్టులు తదితర సిబ్బంది కొత్తగా వస్తారు. ఇది పూర్తి అయితే నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారికి ఎంతో మేలు జరుగుతుంది. పక్కనే ఉన్న వంద పడకల ఆస్పత్రికి వికారాబాద్ జిల్లాతోపాటు కర్నాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇక్కడి వస్తుంటారు. ఆస్పత్రిలో ప్రస్తుతం నెలకు 300 లకు పైగా డెలవరీలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే డెలవరీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు భవన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు వేసి వస్తుండగా..

- స్కూటీని ఢీకొట్టిన ఆటో
- వ్యక్తికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: స్కూటీని ఆటో ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ ఆసిఫ్ నగర్‌కు చెందిన షేక్ మొయినుద్దీన్ సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తన స్వగ్రామం జహీరాబాద్ రంజోల్‌కు ఓటు వేసేందుకు వెళ్లాడు. ఓటు వేసి సాయంత్రం తిరిగి హైదరాబాద్ వైపు వస్తుండగా పటాన్‌చెరు శివారులోకి రాగానే గుర్తు తెలియని ఆటో స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ మొయినుద్దీన్‌కి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి అల్లుడు మహమ్మద్ నయీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు, బైకు ఢీకొని..

కొల్చారం(నర్సాపూర్): కారు, బైకు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని మెదక్–జోగిపేట రహదారి దుంపలకుంట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన రమేశ్ రంగంపేట నుంచి జోగిపేటకు బైక్‌పై వెళ్తున్నాడు. సీతారం తండాకు చెందిన ఆశూ కారులో జోగిపేట నుంచి వస్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొనగా బైక్‌పై ఉన్న రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రమేశ్‌ను వైద్యం కోసం మెదక్‌కు తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

కల్వర్టులో పడి వ్యక్తి మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): నిర్మాణంలో ఉన్న కల్వర్టులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడూరు క్రాస్ సమీపంలో చోటు చేసకుంది. మంగళవారం ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన మహమ్మద్ యాకూబ్ పాషా(30) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి తల్లికి సిద్దిపేటకు వెళ్లి మందులు తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయలు దేరాడు. జనగామ–సిద్దిపేట రహదారిలో తాడూరు క్రాస్ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంలో బైక్‌తో సహా కల్వర్టులో పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య షహనాజ్ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే తన భర్త మృతి చెందారని, రోడ్డు నిర్మాణ సంస్థ ఆర్ అండ్ సీ కంపెనీ మేనేజర్ కందోకర్ హుస్సేన్ సర్వర్ పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించాలి

చేర్యాల(సిద్దిపేట): యువకుడి మృతికి కారణమైన రోడ్డు పనుల కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, మృతుడి కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పట్టణ కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణం చేసే ప్రాంతంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో బైక్ అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొట్టి యాకూబ్ మృతి చెందాడన్నారు. రాస్తారోకోలో తోటి డ్రైవర్లు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన గోపీచంద్(30) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేల 12వ తేదీన గోపీచంద్, భార్య స్వప్న గొడవపడ్డారు. దీంతో స్వప్న ముగ్గురు పిల్లల్ని తీసుకొని తల్లి గారి ఇంటికి ఘనపూర్ వెళ్లింది. గోపీచంద్ భార్యకు ఫోన్ చేసి ఇంటికి రమ్మనగా రాలేదు. 12వ తేదీ రాత్రి ఇంట్లో దూలానికి గోపీచంద్ ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి జానమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన అల్లాదుర్గం మండలం వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గోల్ల సాయమ్మ పాడి గేదెను మెపుకుంటూ పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. గేదెను మేపి సొంత బోరు వద్ద విద్యుత్ స్తంభానికి కట్టేసింది. బోరు బావికి సరఫరా అయ్యే వైరు వల్ల కరెంట్ షాక్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.70 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎవరి ధీమా వారిదే

- ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తం
- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో త్రిముఖ పోరు
- ఓటింగ్ సరళిపై ప్రధాన పార్టీల నేతల విశ్లేషణ

జహీరాబాద్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తం అయ్యింది. ఓటింగ్ తమకు అనుకూలంగా జరిగినట్లు, గెలుపు తమదే అంటూ పలు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రధాన పార్టీల నేతలు, అభ్యర్థులు తమకు ఏ మేరకు అనుకూలంగా పోలింగ్ జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు. ఏయే వర్గాలు ఏయే పార్టీలకు అనుకూలంగా ఓటు వేశారనే దానిపై విశ్లేషించుకుంటున్నారు.

– జహీరాబాద్




సురేశ్ శెట్కార్, కాంగ్రెస్


బీబీ పాటిల్, బీజేపీ


అనిల్‌కుమార్, బీఆర్ఎస్

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేశ్ శెట్కార్, బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్, బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌లు పోటీ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే ఈసారి జరిగిన ఎన్నికల్లో పోరు రసవత్తరంగా సాగింది. అనూహ్యంగా బీజేపీ పుంజుకోవడంతో త్రిముఖ పోరు సాగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నామ మాత్రంగా ఉన్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి కింది స్థాయి వరకు చొచ్చుకుపోయింది. ప్రజల ఓటింగ్ సరళిని బట్టి ప్రధాన పోరు రెండు జాతీయ పార్టీ మధ్యే సాగినట్లు తెలుస్తోంది.

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పరిధిలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానాలుండగా, కామారెడ్డి జిల్లా పరిధిలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఎన్నికల్లో ఆయా అసెంబ్లీ స్థానాల్లో పార్టీల ప్రభావం, అభ్యర్థుల గుణగణాలు, జాతీయ స్థాయిలో నెలకొన్న పరిణామాలను బట్టి ఓటింగ్ జరిగినట్లు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉన్నారు. బీఆర్ఎస్ మాత్రం జాతీయ పార్టీల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, ప్రాంతీయ పార్టీల వల్లే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి వేగంగా జరుగుతుందని ప్రజలు భావించి ఓటు వేసినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. అభ్యర్థులు, ప్రధాన పార్టీల నాయకులు ప్రచారం చేసినా ఓటర్లు మాత్రం ఎవరికి ఓటు వేయాలనేది ముందుగానే నిర్ణయించుకున్నారు. ఎన్నికల్లో పార్టీ నేతలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. జాతీయ స్థాయిలో నెలకొన్న అంశాల ఆధారంగా ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. జూన్ 4వ తేదీన అభ్యర్థుల భవిత్యం బహిర్గతం కానుంది.

అధికారంలో ఉన్నందున గెలుస్తామని..

కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో పార్టీ తరపున పోటీ చేసిన సురేశ్ శెట్కార్ గెలుపు ఖాయమనే ధీమాను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తమకు అనుకూలంగా ఓటింగ్ వేశారని పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు మార్గం సుగమం అవుతుందంటున్నారు. గతంలో ఒక పర్యాయం శెట్కార్ ఎంపీగా చేసినందున తమకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు.

మోదీ చరిష్మాతో తమదేనని..

బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ మాత్రం ప్రధాని నరేంద్రమోదీకి ప్రజల్లో ఉన్న ఆదరణ, చరిష్మా, పార్టీకి సంస్థాగతంగా ఉన్న నిర్మాణంతో గెలుపు ఖాయమని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. పోలింగ్ సమయంలో గ్రామ స్థాయి నుంచి మోదీ ఆదరణ కనిపించిందంటున్నారు. మోదీతోనే దేశ భద్రత, మహిళల అభ్యున్నతి, సంరక్షణ, దేశ భవిష్యత్ సాధ్యమనే భావన ప్రజల్లో ఉందని, దీంతో బీజేపీకి అనుకూలంగా పోలింగ్ జరిగిందనే ఆశతో ఉన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా గెలుపొందడం, తమకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజల సంక్షేమం

బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్ కుమార్‌ను గెలిపించుకోవడంతోనే ప్రజాసంక్షేమం సాధ్యపడుతుందని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి చేసిన తప్పిదంతో సంక్షేమ పథకాలు అటకెక్కాయని, ఈ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్‌కు అండగా ఉండడం ద్వారానే తమకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని, ఇది బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.